రోడ్‌షోతో ప్రారంభమై.. కరచాలనంతో ముగిసి..

• ప్రధాని మోదీ రోడ్‌షోకు భారీగా జనం • పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో ప్రధాన మంత్రి మోదీ రోడ్‌షో విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. మీర్జాలగూడ నుంచి సాయంత్రం 5.15కు ప్రారంభం కావాల్సిన రోడ్‌షో ఆలస్యంగా సాయంత్రం 6.24కు ప్రారంభమై రాత్రి 7 గంటలకు ముగిసింది. రహదారికి ఇరువైపులా ప్రజలు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

మోదీ రోడ్‌షో హైలెట్స్..

- మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తర్వాత మల్కాజిగిరిలో పర్యటించిన ప్రధానిగా మోదీ నిలిచారు. 1983లో కంటోన్మెంట్‌లో భాగమైన మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మచ్చేందర్‌రావుకు మద్దతుగా ఇందిరాగాంధీ పర్యటిస్తే రాబోయే ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ప్రధాని నరేంద్ర మోడీ రోడ్‌షోలో పాల్గొన్నారు.
- రోడ్‌షోలో మోదీతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ మాత్రమే ఉన్నారు.
- మల్కాజిగిరి చౌరస్తాలో వాహనం దిగిన మోదీ పార్టీ సీనియర్ నాయకులకు నమస్కరించి వెళ్లిపోయారు.
- మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులతో ర్యాలీగా తరలివచ్చి స్వాగతం పలికారు.
- మధ్యాహ్నం నుంచే ప్రజలు మోదీని చూసేందుకు ఆసక్తిగా పలు కూడళ్లకు చేరుకున్నారు.
- రోడ్‌షో ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పర్యవేక్షించారు.
- సీపీఎం మండల కార్యదర్శి కృపాసాగర్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.
- భద్రతా ఏర్పాట్లను రాచకొండ కమిషనర్ డాక్టర్ తరుణ్‌జోషి, డీసీపీ పి.వి.పద్మజ, ఏసీపీ చక్రపాణి, మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షించారు.
- రోడ్‌షోలో భాగంగా ప్రధాన మంత్రి మాట్లాడకపోవడంతో కార్యకర్తలు, ప్రజలు నిరాశతో వెనుతిరిగారు.





మిర్జాల్‌గూడలో ప్రధాని మోదీ రోడ్ షో

మిర్జాల్‌గూడ కాషాయమయం

గౌతంనగర్: కేంద్రంలో మరోమారు మోదీ సర్కార్ రావడం ఖాయం.. ఫీర్ ఏక్ బార్ 400 పార్(మరో మారు 400 సీట్లకు పైగా) రావడం ఖాయం.. మోదీ జిందాబాద్ అంటూ మల్కాజిగిరి సర్కిల్‌లోని మిర్జాల్‌గూడ చౌరస్తా శుక్రవారం సాయంత్రం మర్మోగింది. ప్రధాని మోదీ వస్తున్నాడన్న వార్త తెలియడంతో వేలాది మంది జనం రాకతో మిర్జాల్‌గూడ ప్రాంతం కిక్కిరిసింది. మధ్యాహ్నం 3 గంటలకే జనం మిర్జాల్‌గూడ కూడలిలోకి రావడంతో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

- మిర్జాల్‌గూడ చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్వాగత సభపై సంచార జాతుల వారు నిర్వహించిన నాటిక, వాయిద్య కళాకారులు సన్నాయి మేళంతో ఆలపించిన భక్తి గీతాలు ఔరా అనిపించాయి.
- పోతరాజుల విన్యాసాలు, బతుకమ్మ ఆటపాటలు ఆకట్టుకున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ఉన్నారు. మిర్జాల్‌గూడలో ప్రారంభమైన రోడ్‌షో సాయిరాం, యాదవనగర్ మీదుగా మల్కాజిగిరి చౌరస్తా వరకు కొనసాగింది.
- కేంద్రం, రాష్ట్రం, రాచకొండ పోలీసు బలగాలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం వారు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.



ర్యాలీగా తరలివచ్చిన మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్



మోదీకి పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



సాయినగర్ నుంచి మోదీ రోడ్ షోకు వెళ్తూ..



వాయిద్య కళాకారుల నృత్యాలు

కృతజ్ఞతలు



హబ్సిగూడ: బీఆర్ఎస్ నుంచి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించినందుకు రాగిడి లక్ష్మారెడ్డి శనివారం రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి పుష్పాభిషేకం



హెచ్‌బీకాలనీలో పుష్పాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుషాయిగూడ: వంద రోజుల కాంగ్రెస్ పాలన, ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి తీరుపట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ ఇందిరాగాంధీ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి పాలన తీరుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీ మేరకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు జలగం వెంకటేష్, సుబ్బన్న, శ్రీకాంత్, ఇంజ మల్లేష్, జయరాజ్, యాదగిరి మేరు, జెమిని, సంజీవరెడ్డి, సునీత, జ్యోతి పాల్గొన్నారు.

నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి



జెడ్సీతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: డివిజన్ సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శుక్రవారం జెడ్సీ ముకుంద్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనతో పాటు నూతనంగా ఏర్పడ్డ కాలనీల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్ల నిర్మాణాలపై జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కోరారు. డివిజన్‌లో చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేపట్టి వాడుక నీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో త్వరగా అభివృద్ధి పనులను ప్రారంభించాలని కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు.

కాన్సీరాం జయంతి



నాచారంలో కాన్సీరాం జయంతి వేడుకల్లో బీఎస్పీ నేతలు

మల్లాపూర్: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని నాచారంలో శుక్రవారం బీఎస్పీ నేతలు ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి గౌడ్ సుదర్శన్ మాట్లాడారు. కాన్షీరాం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షులు శివకృష్ణ, నాచారం డివిజన్ ఇన్‌చార్జి మింద్రాల నర్సింగ్‌రావు, మహిళా కన్వీనర్ హసీయ బేగం, సురేష్, అనిల్ కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణానికి స్థలాల పరిశీలన



పీర్జాదిగూడ మున్సిపల్ అధికారులతో కమ్యూనిటీ భవనాల స్థలాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయడంపై కాంగ్రెస్ పార్టీ స్థానిక అధ్యక్షుడు రవి హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, పీర్జాదిగూడ విభాగం జలమండలి అధికారులు నిర్మల, తిరుపతితో శుక్రవారం సమావేశమయ్యారు. భవనాలు నిర్మించబోయే ప్రదేశాలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. నాయకులు రాంరెడ్డి, నగేష్, రంజిత్ రెడ్డి, పవన్‌గౌడ్, మోహన్, జంగాచారి, ఐలేష్ యాదవ్, సుదర్శన్‌రెడ్డి, నాగరాజు, మణిరాం నాయక్, ఉదయ్‌రాజ్‌గౌడ్, ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, కపిల్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత బద్రునాయక్, నందితగౌడ్, శారదాగౌడ్, దివ్య పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదుకు స్పందన



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో శుక్రవారం సీపీఐ చెంగిచర్ల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి స్పందన లభించింది. కార్యక్రమానికి సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ హాజరై మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పార్టీ పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలుస్తోందన్నారు. కార్మికులు, కర్షకులు, వివిధ రంగాల్లో ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు సభ్యత్వం పట్ల ఆకర్షితులై సభ్యత్వం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో చెంగిచర్ల శాఖ కార్యదర్శి సీహెచ్ మాధవి, బీకేఎంయూ మండల కార్యదర్శి మహాలక్ష్మి, నాగమణి, అనూష, స్వరూప, వరలక్ష్మి, సుజాత, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



బాబానగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాబానగర్ కాలనీలో రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరమైన చోట సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను చేపడుతున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీటం వేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. డీఈ రూప, ఏఈ సవంత్రి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, కాలనీవాసులు సూర్ణం శివ, జలగం శ్రీను, బీఆర్ఎస్ నేతలు వాసుగౌడ్, రాపోలు సతీష్, పీఆర్.ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి, పద్మారెడ్డి, రవినాయక్, ఎండీ ఉస్మాన్, మల్లేష్, భూమండ్ల శ్రీశైలం పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా..

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ వీఎన్‌రెడ్డినగర్‌లో రూ.36 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీవరేజ్ పైప్‌లైన్ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాలన్న ఆశయంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం సతీష్, ఏఈ రోహిత్, కాలనీ అధ్యక్షుడు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రామచందర్, లక్ష్మీనారాయణ, బుచ్చిరెడ్డి, సూర్య భగవాన్, బాలరాజు, వరప్రసాద్, లక్ష్మణ్‌సింగ్‌తో పాటు పాండాల శివకుమార్‌గౌడ్, మల్లేష్ వంశరాజ్, బొడిగె రాజు, కనకరాజుగౌడ్, తాళ్ల వెంకటేష్‌గౌడ్, అనిల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వీఎన్‌రెడ్డినగర్‌లో సీవరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కానిస్టేబుల్ అసభ్యంగా మాట్లాడటం బాధాకరం



మాట్లాడుతున్న వీఎస్ బోస్ తదితరులు

మల్లాపూర్: నాచారం పోలీసులు దురుసు ప్రవర్తన, అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ముందస్తు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర అన్నారు. శుక్రవారం ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ధర్మేంద్రను ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేయడానికి వచ్చిన నాచారం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ అసభ్యంగా మాట్లాడటం బాధాకరం అన్నారు. కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్రను వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ బోస్, సీపీఐ నాచారం డివిజన్ కార్యదర్శి కృపాకర్, ఏఐటీయూసీ కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు, నర్సింహ డిమాండ్ చేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీ రోడ్డు శంకుస్థాపనలో కార్పొరేటర్ నర్సింహ

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ అన్నారు. 28వ డివిజన్ పరిధిలో హనుమాన్ ఆలయం రోడ్డు రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో డివిజన్ పరిధిలో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, సాయి ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు శివప్రసాద్, నేతలు పోగుల దిలీప్‌రెడ్డి, కాటపల్లి సత్యంరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిబిరం

బోడుప్పల్: 15వ డివిజన్ పరిధిలో ఉన్న మహిళలకు ఈ నెల 17వ తేదీన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి సిగురు రేణుక రవికుమార్ వెల్లడించారు. బోడుప్పల్‌లో ఆమె శుక్రవారం మాట్లాడుతూ ఈ ఉచిత శిక్షణ పొందాలనుకునే మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం 15వ డివిజన్‌లో ఉన్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నమోదు కోసం ఫోన్: 91000 33366.

నేడు జాతీయ లోక్ అదాలత్

కుషాయిగూడ: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోర్టు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బీఆర్ మధుసూదన్‌రావు, రాచకొండ సీపీ తరుణ్‌జోషి, జిల్లా కలెక్టర్ గౌతమ్ హాజరవుతున్నట్లు తెలిపారు. న్యాయ సహాయం కోసం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ మాసం మొదటి శుక్రవారం ప్రార్థనలు



గౌతంనగర్: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మల్కాజిగిరి జోన్ పరిధిలోని మల్కాజిగిరి, గౌతంనగర్, మౌలాలి, నేరేడ్‌మెట్, అల్వాల్‌లోని మసీదుల్లో ముస్లిం సోదరులు మొదటి శుక్రవారం ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

కళారత్న డాక్టర్ భారతికి కీర్తి పురస్కారం



గౌతంనగర్: కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు, కూచిపూడి నాట్య గురువు, కళారత్న లయన్ డాక్టర్ ఎస్‌పి.భారతి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు అందించే ప్రతిష్టాత్మకమైన కీర్తి పురస్కారానికి ఎంపికైంది. ఈ నెల 21వ తేదీన నగరంలోని తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ కళామందిరంలో ఆమె ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

వ్యక్తి అదృశ్యం



లక్ష్మన్న (ఫైల్)

అల్వాల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ లక్ష్మీనగర్‌లో నివసించే లక్ష్మన్న(40) వృత్తి ఆటో డ్రైవర్. ఈ నెల 13వ తేదీన లక్ష్మన్న భార్య సరస్వతితో గొడవ జరగడంతో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది కేసీఆరే..

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

హబ్సిగూడ: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికైన రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం హబ్సిగూడలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తెలియజేసే విధంగా కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో ఉంటూ మల్కాజిగిరి పార్లమెంట్‌లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేస్తామన్నారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వడంపై రాగిడి లక్ష్మారెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, నాయకులు సాయిజెన్‌శేఖర్, బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, డివిజన్ అధ్యక్షకార్యదర్శులు, మహిళా నాయకురాళ్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి



ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తూ..

రామంతాపూర్: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు మైనార్టీ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. రామంతాపూర్‌లోని అంబేద్కర్ సేవా సమితి భవనానికి, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, రజక సంఘం శారదానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.ఒక కోటి 30 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను శుక్రవారం ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు విడతల వారీగా నిధులు మంజూరు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు తోఫిక్, మురళి, రఫీ, గిరిబాబు, సురేష్, జలీల్ పాషా, సందీప్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసిన రాగిడి లక్ష్మారెడ్డి



అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాన్షీరాం సేవలు భేష్

మేడిపల్లి: బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేసిన సామాజిక, సమానత్వ, సిద్ధాంతకర్త కాన్షీరాం జయంతిని మేడిపల్లిలో అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం దయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పాశం రాజుయాదవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ కుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ సంఘాల నాయకులు సాయి, పాశం సత్యం, మనోజ్, వెంకార్, శివ, పరమేష్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

